

వైసీపీ ఫ్లాప్ షో

తేలిపోయిన తొలి ఎన్నికల సభ

'సిద్ధం' పేరుతో భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహణ



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్



సీఎం ప్రసంగిస్తుండగా ఖాళీగా వున్న సభా స్థలం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

అధికార వైసీపీ భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో శనివారం నిర్వహించిన తొలి ఎన్నికల సభ తేలిపోయింది. ఈ సభను మూడు లక్షల మందితో నిర్వహించబోతున్నామంటూ వైసీపీ నాయకులు ప్రకటిస్తూ వచ్చారు. సభ కోసం మూడు వారాల ముందు నుంచే ఉత్తరాంధ్ర నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారెడ్డి, సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం వంద మంది చొప్పున, నియోజకవర్గానికి పది వేల మందికి తక్కువ కాకుండా తరలించాలని ఎమ్మెల్యేలు/సమన్వయకర్తలను ఆదేశించారు. ఇందుకోసం అంగ, అర్థ, అధికార బలాన్ని వినియోగించారు. ఇన్ని చేసినప్పటికీ సభకు గట్టిగా 30 వేల మందికి మించి తీసుకురాలేకపోయారు. సభా ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది.

- మూడు వారాల నుంచి కసరత్తు
- నియోజకవర్గాల్లో సమావేశాలు
- మూడు లక్షల మందిని సమీకరిస్తున్నట్టు నాయకులు ప్రకటనలు
- 30 వేలకు మించి హాజరుకాని ప్రజలు, కార్యకర్తలు
- వెయ్యికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ఏర్పాటు
- అయినా ఫలితం శూన్యం
- అనేక గ్రామాలకు వెళ్లిన బస్సుల్లో ఐదారుగురికి మించి రాని వైనం
- జగన్ ప్రసంగానికి కేడర్ నుంచి స్పందన కరవు
- ఆయన ప్రసంగం ప్రారంభించగానే బయటకు క్యూ కట్టిన జనం

జాతీయ రహదారికి ఆనుకుని సంగివలస వద్ద 14 ఎకరాల్లో ఈ సభను ఏర్పాటుచేశారు. ఇందులో 12 ఎకరాల్లో మాత్రమే సభను నిర్వహించారు. వైసీపీ నాయకులు చెప్పినట్టు మూడు లక్షల మందితో సమావేశాన్ని నిర్వహించేందుకు అవకాశం లేదు. గట్టిగా 60 వేల మంది వచ్చినా ఈ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. కానీ, జనాలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ప్రాంగణంలో దాదాపు సగం ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో వైసీపీ నాయకులు కూడా షాక్‌కు గురయ్యారు.

ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు..

సభ కోసం వైసీపీ నాయకులు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఏర్పాటుచేశారు. ప్రతి గ్రామానికి బస్సులను పంపించారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులను వినియోగించారు. అయితే, వాహనాలు అయితే భారీగా సమీకరించారు గానీ ఆ స్థాయిలో ప్రజలను సభకు తీసుకురావడంలో నాయకులు విఫలమయ్యారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం వంద మంది వచ్చేలా చూడాలంటూ ... మిగతా 4వ పేజీలో



సభ నుంచి సగంలోనే వెనుతిరిగి వెళ్లిపోతున్న జనం

విశాఖ ఊసే లేదు!

- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా మౌనం
- అభ్యర్థులపైనా స్పష్టత ఇవ్వని వైసీపీ అధినేత
- నేతల్లో విస్మయం



శంఖం పూరిస్తున్న వైఎస్ జగన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాబోయే ఎన్నికలకు 'సిద్ధం' అంటూ విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలస నుంచి సమరశంఖం పూరించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశాఖపట్నం గురించి గానీ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై గానీ ఒక్క ముక్క మాట్లాడలేదు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తా, నగరానికి దసరాకు వస్తా..డిసెంబరులో వస్తా... అంటూ నాలుగేళ్లుగా ఊరింపు మాటలు చెప్పిన వైసీపీ అధినేత... ఇప్పుడు ఆ ప్రస్తావనే తేలేదు.

ఉత్తరాంధ్రాను ఉద్ధరించడానికే మూడు రాజధానులు అంటూ చెప్పిన ఆయన ఆ ఉత్తరాంధ్రాకు ఏమి చేశారో కూడా చెప్పలేకపోయారు. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతానికి ఏమి చేశారో చెప్పి ఓట్లు అడుగుతారని అంతా భావించారు. చెప్పుకోవడానికి ఏమీ లేదని అనుకున్నారేమో ఆ టాపిక్ తీసుకురాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు అని చెప్పి దానికి నెల క్రితం వరకు డీపీఆర్ ఆమోదించలేదు. తీరుబడిగా ఇప్పుడు కేంద్రానికి పంపారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు శంకుస్థాపన చేస్తే... ఈయన దానికి నాలుగేళ్ల తరువాత మళ్లీ శంకుస్థాపన చేశారు. అప్పటివరకు ఏ పని ముట్టుకోలేదు. సీఎం కాగానే కాపులుప్పాడలో హిస్టర్ పార్కుకు రూ.80 కోట్లతో శంకుస్థాపన చేశారు. దానికి ఇప్పటికీ డీపీఆర్ పూర్తికాలేదు. అదానీ డేటా సెంటర్‌కు టీడీపీ హయాంలో కేటాయించిన భూమిని అధికారంలోకి రాగానే రద్దు చేశారు. ఆ తరువాత మళ్లీ ఆయనే భూమి ఇచ్చి గత ఏడాది మే నెలలో శంకుస్థాపన చేశారు. అక్కడ ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. విశాఖలోనే భారీ పెట్టుబడుల సదస్సు నిర్వహించినా విశాఖకు ఒనగూరిందేమీ లేదు. ఇక్కడ ఆయన హయాంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మిన్నకుండిపోయారని పార్టీ వర్గాలో గుసగుసలు వినిపించాయి. ఇది ఎన్నికల శంఖారావం కావడంతో కనీసం జిల్లాలో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లు అయినా ప్రకటిస్తారని నేతలు భావించారు. భీమిలి నియోజకవర్గంలో సభ పెట్టి..పక్కనే సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిల్చొని ఉన్నా..అక్కడి అభ్యర్థి గురించి కూడా కనీసం ప్రకటన చేయలేదు. జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురించి ప్రస్తావన కూడా రాలేదు. ఇక విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొత్స ఝూన్సీని నియమించారు. కనీసం ఆమెను కూడా ఈ సభలో ప్రజలకు పరిచయం చేయలేదు. ఇప్పటికే నిర్ణయించిన అభ్యర్థులను వేదికపై పరిచయం చేసి, వారిని గెలిపించాలని కోరితే బాగుండేదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అయితే, ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉందని, అందుకే అలాంటి ప్రయత్నం చేయలేదని సీనియర్ నాయకులు అంటున్నారు.

సభకు అక్కరమాని దంపతులు గైర్హాజరు?

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మొన్నటివరకు వైసీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా, వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన అక్కరమాని విజయనిర్మల శనివారం సంగివలసలో జరిగిన వైసీపీ సిద్ధం సభకు గైర్హాజరయ్యారు. ఆమె భర్త వెంకటరావు కూడా కనిపించలేదు. ఈ సభా వేదిక వారి ఇంటికి వంద అడుగుల దూరంలోనే ఉన్నాసరే వారు వెళ్లకపోవడంపై పార్టీ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. తూర్పు ఇన్‌చార్జిగా ఉన్న అక్కరమానిని తొలగించి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించారు. ఆ తరువాత కార్పొరేషన్ ఛైర్మన్ పదవులకు సంబంధించి చొక్కాకుల, కొండా రాజీవ్ కుటుంబీకులకు పొడిగింపు ఇచ్చారు. అక్కరమానికి వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్‌గా పొడిగింపు ఇవ్వలేదు. దాంతో వారు పార్టీకి దూరంగా ఉన్నారు.



సభ ముగిసిన అనంతరం జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్

హైవేపై ట్రాఫిక్ జామ్

- జనాన్ని తరలించేందుకు ఉపయోగించిన వాహనాలు జాతీయ రహదారిపైనే నిలిపివేత
- దీంతో అటు అవంతి కళాశాల నుంచి ఇటు ఆనందపురం వరకు ట్రాఫిక్ జామ్

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారి పక్కనే సంగివలసలో వైసీపీ ఎన్నికల సభ ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సభకు జనాలను తీసుకువచ్చిన బస్సులు, ప్రైవేటు వాహనాలను రహదారిపైనే నిలిపివేశారు. లారీలు, ఇతర వాహనాలను సర్వీస్ రోడ్డులోకి మళ్లించారు. సాయంత్రం ఆరు గంటలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం ముగిసిన తరువాత ఒక్కసారిగా సభా ప్రాంగణం నుంచి కార్యకర్తలు జాతీయ రహదారిపైకి వచ్చారు. అప్పటివరకూ వారిని తిరిగి తీసుకువెళ్లేందుకు ఏర్పాటుచేసిన బస్సులు రోడ్డుపైనే నిలిపి ఉంచడంతో...ఇటు అవంతి కళాశాల నుంచి అటు ఆనందపురం వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

ప్రయాణికులు పడిగాపులు

జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 804 ఆర్టీసీ బస్సులు

- వైసీపీ సభకు 325 బస్సులు కేటాయింపు
- చాలారూట్లలో బస్సులు తగ్గింపు
- బస్టాప్‌లలో గంటల తరబడి నిరీక్షణ
- పార్టీ సమావేశానికి ఆర్టీసీ బస్సులు తరలించడంపై ఆగ్రహం
- ఫుట్‌బోర్డుపై వేలాడుతూ విద్యార్థుల ప్రయాణం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ కారణంగా నగరంలో ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'సిద్ధం' పేరుతో వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సును భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలస వద్ద శనివారం ఏర్పాటుచేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి హాజరవుతుండడంతో సభకు భారీగా జనాలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను కేటాయించాలని అధికారులను వైసీపీ నేతలు ఆదేశించారు. దీంతో విశాఖ జిల్లా పరిధిలోని ఏడు డిపోల నుంచి 325 బస్సులను కేటాయించారు. ఏడు డిపోల పరిధిలో 804 బస్సులు ఉండగా...వాటిలో ఏకంగా 325 బస్సులను జనాలను తరలించేందుకు కేటాయించారు.



బస్సుల కోసం విద్యార్థినుల ఎదురుచూపులు

బస్సులను ఉదయం ఎనిమిది గంటల నుంచే వైసీపీ నేతలు కోరిన ప్రాంతాలకు పంపించారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ బస్సులు తిరిగి డిపోలకు చేరుకోలేదు. శనివారం అంతా 325 బస్సులు వైసీపీ సభకే పరిమితం అయ్యాయి. జిల్లాలో తిరిగే బస్సుల్లో ఒకేసారి 325 బస్సులు రాకపోకలు నిలిచిపోయేసరికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల పైనే ఆధారపడి ప్రయాణాలు చేసే ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా ఉపయోగం లేకపోవడంతో చాలామంది ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. బస్‌పాస్‌లు కలిగిన విద్యార్థులు తప్పనిసరిగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి. దీంతో వారంతా బస్సు వచ్చేంత వరకూ వేచి ఉండి, అప్పటికే ప్రయాణికులతో కిటకిటలాడుతున్నా సరే, తప్పనిసరి కావడంతో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణించారు.

ఇదిలావుండగా శనివారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉంది. నగర పరిధిలోని గాజువాక, చినముషిడివాడ, పెందుర్తి వంటి శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులంతా బస్సుల కోసం చాలాసేపు ఎదురుచూసి...తర్వాత విషయం తెలుసుకుని ప్రత్యామ్నాయ రవాణా సాధనాలపై దృష్టిసారించారు. కొంతమంది కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వాహనంతో రమ్మని చెప్పి, అక్కడి నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చింది. జగదాంబ జంక్షన్, డాబాగార్డెన్స్, ఆశీల్‌మెట్ట, ద్వారకానగర్, దొండపర్తి, అక్కయ్యపాలెం, స్వర్ణభారతి స్టేడియం జంక్షన్, సీతమ్మధార, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, హనుమంతవాక జంక్షన్లలో బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉన్నవారంతా ఆర్టీసీ అధికారులపై ... మిగతా 4వ పేజీలో



ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

నా...నా...నా...నా...

సాగతీత ధోరణిలో జగన్ ప్రసంగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భీమిలి నియోజకవర్గంలోని సంగివలసలో 'సిద్ధం' పేరుతో అధికార పార్టీ వైసీపీ శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనదైన శైలిలో విన్యాసాలు చేశారు. ఆయన ఎప్పుడూ నా బీసీలు, నా అక్కచెల్లెళ్లు...అంటూ మాట్లాడుతుంటారు. అది ఆయనకే కామెడీగా అనిపించేదేమో...వారి గురించి ప్రస్తావిస్తూ...వైసీపీ అధికారంలోకి వచ్చాక 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిందని, వారిలో 80 శాతం మంది 'నా...నా...నా...నా...' బీసీ తమ్ముళ్లు అంటూ సాగదీస్తూ మాట్లాడారు. దీనికి సభ ప్రాంగణం మొత్తం పడి పడి నవ్వింది. అలాగే సామాజిక న్యాయం గురించి మాట్లాడుతూ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లుగా నా...నా...నా...నా...ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లకు పదవులు ఇచ్చానని చెప్పుకొన్నారు.

రెండు చేతులూ పైకెత్తమని...

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో చేసిన పనులు, తాను సీఎంగా చేపట్టిన పనులు పోలుస్తూ, చంద్రబాబు ఏమీ చేయలేదని, తానే అన్నీ చేశానని, ఇన్ని నిజాలు తెలిశాక ప్రజలు టీడీపీకి ఓట్లు వేస్తారా?...అంటూ సభకు హాజరైన వారిని ప్రశ్నించారు. రెండు చేతులు పైకెత్తి అటు..ఇటు తిప్పుతూ.. 'నో...నో...' అని చెప్పాలని కార్యకర్తలను కోరి... వారితో 'నో.. నో అంటూ చెప్పించారు. ఇదంతా వేదిక పై నున్నవారికే నవ్వు తెప్పించింది.

ఎటు చూసినా జగన్ మార్కే

ప్రతిచోట వైసీపీ రంగులు ఉండాలని, తన ... మిగతా 4వ పేజీలో

సంక్షేమ హాస్టళ్లపై పర్యవేక్షణ కరువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

- ఉదయం వచ్చి సాయంత్రం ఇళ్లకు వెళ్లిపోతున్న వార్డెన్లు
- అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది విద్యార్థులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- తల్లిదండ్రుల్లో ఆందోళన

సంక్షేమ హాస్టళ్లలో ఉండాల్సిన వార్డెన్లు ఇళ్లకు వెళ్లిపోతుండ డంతో విద్యార్థులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. నగర పరిధిలోని అనేక హాస్టళ్లలో విద్యార్థులు ఎప్పుడు బయటకు వెళతారో, ఎప్పుడు తిరిగి వస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొని ఉంది. బయట వ్యక్తులు కూడా హాస్టళ్లలో ఉంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

అనకాపల్లి జిల్లా చోడవరం బీసీ సంక్షేమ వసతి గృహానికి చెందిన పదో తరగతి విద్యార్థులు నూతన సంవత్సరం సందర్భంగా మందు పార్టీ చేసుకోవడం కలకలం రేపింది. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. అయితే, జిల్లాలోని అనేక వసతి గృహాల్లో విద్యార్థులు ఇప్పటికీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నచ్చినప్పుడు వెళ్లడం, రావడం పరిపాటిగా మారింది. సదరు విద్యార్థి ఎక్కడకు వెళుతున్నాడన్న విషయాన్ని అడిగే నాథుడు లేడు. నిత్యం హాస్టల్‌లో ఉండాల్సిన వార్డెన్లు ఉదయం పది గంటలకు వచ్చి, సాయంత్రం ఐదు గంటలు దాటకముందే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కుక్, వాచ్‌మన్లకు విద్యార్థుల పర్య వేక్షణ బాధ్యతలను అప్పగిస్తున్నారు. అయితే, వారి మాటను విద్యార్థులు లెక్కచేయడం లేదు. కొన్నిచోట్ల డబ్బులిచ్చి వారిని మేనేజ్ చేస్తున్నారు.

తీవ్రమైన ఇబ్బందులకు అవకాశం

విశాఖ జిల్లాలో 22 సాంఘిక సంక్షేమ, 29 బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో సుమారు ఆరు వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో సుమారు 25 వరకూ హాస్టళ్లు నగర పరిధిలోనే ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న కొంతమంది విద్యార్థులు ఉదయం వెళ్లి రాత్రికి వస్తున్నారు. ఎక్కడికి వెళ్లింది, ఏం చేస్తున్నదీ అడిగేవారు ఉండడం లేదు. కొంతమంది సినిమాలు, షికార్లు అంటూ తిరుగుతున్నారు. మరికొంతమంది దురలవాట్లకు అలవాటు పడుతున్నారు. వీటిని అరికట్టాలంటే ఉన్నతాధికారులు దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వార్డెన్లు తప్పకుండా హాస్టళ్లలోనే ఉండేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతున్నారు. అతికొద్ది చోట్ల మినహా అనేకచోట్ల వార్డెన్లు హాస్టళ్లలో ఉండడమే లేదన్నది బహిరంగ రహస్యం. ఈ విషయం ఉన్నతాధికారు లకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

రండి బాబు... రండి

- సీఎం సభకు జన సమీకరణ కోసం వైసీపీ నేతల పాట్లు

విశాఖపట్నం/సీతమ్మధార, జనవరి 27: తగరపువలస సమీపాన సంగివలస వద్ద శనివారం జరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభకు జన సమీకరణ కోసం వార్డు స్థాయి వైసీపీ నాయకులు పడరాని పాట్లు పడ్డారు. జనాల తరలింపు కోసం వలంటీర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ క్రమంలో డబ్బులు బాగా ఖర్చుపెట్టారు. కొన్నిచోట్ల ... మిగతా 4వ పేజీలో

30న దుకాణాలకు వేలం

జ్ఞానాపురం, జనవరి 27: జోన్-5 పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీ అయిన జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మంటపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలం పాటను నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ తెలిపారు. గుల్లలపాలెం, సంజీవయ్యకాలనీ, అశోక్‌నగర్‌లోని దుకాణాలకు, మాధవధారలోని మాధవస్వామి కళ్యాణమండపం, కంచరపాలెం బ్రిడ్జి నుంచి 104 వరకు, అక్కయ్యపాలెంరోడ్డు సైడ్ మార్కెట్,జనతాకాలనీ వారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ సైడ్ మార్కెట్లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే ఆస్పత్రిలో ఫొటోథెరపీ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ

విశాఖపట్నం, జనవరి 27: వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శిశు వార్మర్ కమ్ ఫొటో థెరపీ యూనిట్‌ను శనివారం వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు రైల్వే ఆసుపత్రిలో ఉత్తమ చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ యూనిట్‌ను వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం విరాళంగా అందించినట్టు పేర్కొన్నారు. ఈ ఆసుపత్రిలో నెలకు సగటున 15 నుంచి 20 వరకు డెలివరీ కేసులు చేస్తున్న నేపథ్యంలో ఈ యూనిట్‌తో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ఈకార్వో ప్రతినిధులు మధుస్మిత సాహు, కవితా గుప్తా, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్‌కే తిరుఅరుజ్యోతి పాల్గొన్నారు.

న్యాయస్థానాలు దేవాలయాలతో సమానం

▸▸ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

విశాఖపట్నం/డాబాగార్డెన్స్ జనవరి 27: న్యాయస్థానాలు దేవాలయాలతో సమానమైనవని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు అన్నారు. న్యాయమూర్తిగా అందించిన విశిష్ట సేవలకు గాను పోర్టుసిటీ రోటరీ క్లబ్ జస్టిస్ సోమయాజులు దంపతులను శనివారం ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. రాక్‌డేల్ హోటల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ సాధారణ ప్రజలు న్యాయస్థానాలకు వచ్చి న్యాయమూర్తుల నుంచి నిజమైన తీర్పుల కోసం ప్రార్థిస్తారన్నారు. కోర్టులు త్వరితంగా కేసులు పరిష్కరించడం వలన సామాన్యుని సమయం, డబ్బు ఆదాచేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. విశ్రాంత ఆచార్యులు పిల్లా వెంకటరమణ రాసిన ప్రశంసాపత్రాన్ని సభ్యులు ప్రదానం చేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు జీఎస్ రాజు, రొటేరియన్ ఎస్ఏ రామ్మోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.కృష్ణారావు, కార్యదర్శి ఎన్ఎస్ఎన్ రాజు, పూర్వ రోటరీ గవర్నర్ డి.రాజగోపాలరెడ్డి, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కేవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుకు అవార్డు అందజేస్తున్న సభ్యులు

బుల్లయ్య కళాశాలలో టెక్ ఫెస్ట్ మోడల్ ఎక్స్‌పో



నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ మధుకుమార్, కళాశాల ప్రతినిధులు

సీతంపేట, జనవరి 27: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు టెక్ ఫెస్ట్ మోడల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ కె.సోమేశ్వర రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఇంగ్లీష్ స్మార్ట్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రికల్ కార్ తదితర నమూనాలను పరిశీలించారు. తయారీ, వాటి అవశ్యకతపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో మల్లికకు రజతం



మల్లికను అభినందిస్తున్న వీసీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 27: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఏయూ నుంచి ప్రాతినిథ్యం వహించిన ఎస్‌జీజేఎస్ మల్లిక సాయి రజత పతకం సాధించింది. పంజాబ్‌లోని జలంధర్ లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన టోర్నీలో మల్లిక 50-52 కిలోల కేటగిరీలో రజతం కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి శనివారం ఆమెను అభినందించారు.

ఘనంగా హజ్రత్ తాజుద్దీన్ బాబా జయంత్యుత్సవం



వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం, జనవరి 27: మర్రి పాలెం జాకీరు హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ అధ్వ ర్యంలో హజ్రత్ తాజుద్దీన్ బాబా 163వ జయంతి వే డుకలు శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో భాగంగా ముస్లిం సోదరులు, చిన్నారులునమాజు అచరించారు. మజీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించి పాతేహ నిర్వహించారు. అనంతరం కాలనీలో దావత్ నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి అన్సర్‌వల్లి పర్యవేక్షించారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జనవరి 27: కుర్దా డివిజన్‌లో నిర్మాణ పనుల నేపథ్యంలో రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 31న తిరుపతి-పూరి (17480) నిర్ణీత సమయం కన్నా నాలుగు గంటలు, చెన్నై సెంట్రల్-షాలిమార్ (22826) రెండు గంటలు, తిరునెలివేలి-పురిలియా(22606) 4.15 గంటలు, పాండిచ్చేరి-హౌరా (12868) 2.45 గంటలు, చెన్నై-హౌరా (12840) 2.30 గంటలు, సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ (17016) 2.45 గంటలు ఆలస్యంగా బయలుదేరనున్నాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (12830) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరనుంది.

30న గీతంలో ఎడుయూత్ మీట్

ఎండాడ/సాగర్‌నగర్, జనవరి 27: సమాజంలో మానవ విలువలను పెంచడానికి కలిసి నడుద్దాం... కలిసి ఎదుగుదాం.. ముందుకు సాగుదాం.. నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా ఈనెల 30న గీతంలో ఎడుయూత్ మీట్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్ తెలిపారు. వర్సిటీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి 25 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. అనంతరం మీట్‌కి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీఎస్సార్ నిధులతో మొక్కల పెంపకం చేపట్టండి

▸▸ అధికారులకు ఎన్జీటీ సభ్యుడు అహ్మద్ ఆదేశం



మాట్లాడుతున్న ఎన్జీటీ సభ్యుడు అఫ్రోజ్ అహ్మద్

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద పరిశ్రమలు ఇచ్చిన నిధులను పర్యావరణ పరిరక్షణకు దోహద పడేలా మొక్కల పెంపకం, నదుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ సభ్యుడు డాక్టరు అఫ్రోజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జిల్లా పర్యావరణ ప్రణాళిక అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యత కింద పరిశ్రమలు ఇచ్చే నిధులను ఇతర అవసరాలకు మళ్లించవద్దని స్పష్టంచేశారు. జేసీ కేఎస్ విశ్వనాథన్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా అటవీ అధికారి అనంతశంకర్ జిల్లాలో చిత్తడి నేలల వివరాలు, పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ నగరంలో రోజూ ఉత్పత్తి అయ్యే మురుగు జలాలను శుద్ధిచేసి విడుదలచేస్తున్నామన్నారు. జీవీఎంసీ చీఫ్ ఇంజనీరు రామకృష్ణరాజు నగరంలో ప్రస్తుతం మురుగు జలాల శుద్ధిప్లాంట్ సామర్థ్యం, భవిష్యత్తులో శతశాతం శుద్ధికి ప్రణాళిక అమలుచేస్తామన్నారు. సమీక్షలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు జి.నాగిరెడ్డి, ఏఈ ఎ.శ్రీరామచంద్రమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో డ్రోన్ టెక్నాలజీస్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

కంచరపాలెం, జనవరి 27 : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ మధ్య ఒప్పందం కుదరింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్, సంస్థ ప్రతినిధులు శనివారం ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం డ్రోన్ టెక్నాలజీ కేంద్రం ప్రతినిధులు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణను అందించనున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కె.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి ఈ ఒప్పందం చక్కని అవకాశంగా మారుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీస్ కేంద్రం సీఈవో సతీశ్, స్టీల్ ప్లాంట్ మాజీ జనరల్ డైరెక్టర్ ఒ.రామ్మోహన్‌రావు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన డీఆర్‌ఎం కప్ టెన్నిస్ టోర్నీ



విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న డీఆర్‌ఎం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 27:రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన డీఆర్‌ఎం కప్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ పురుషుల 35ప్లస్ డబుల్స్‌లో ఎంవీఎల్‌ఎన్.రాజు, విశ్వేశ్వరరావు జంట విజేతలుగా నిలిచారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్యఅతిథి గా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, సీనియర్ డీఈ (కో ఆర్డినేషన్)మహరాణా, రెడ్డి శ్రీనివాసరావు, రక్షణకుమార్ పాల్గొన్నారు.

నేడు వాకర్స్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, జనవరి 27 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎస్‌ఆర్‌ఐ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు హాజరై గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల వ్యాధులకు తనిఖీలు చేస్తారన్నారు. ఈ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు

▸▸ విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

సిరిపురం, జనవరి 27: ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పై శనివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు పాఠశాలలకు నష్టం కలుగజేయాలన్న ఆలోచన ఎప్పుడూ లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను నడుపుతున్నామని, అందులో ఎటువంటి దురుద్దేశం లేదన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ, ఆ సంఘం రాష్ట్ర (అపూస్మా) అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఈకార్యక్ర మం లో డీఈఓ చంద్రకళ, అపూస్మా రాష్ట్రస్థాయి కమిటీ ప్రతినిధులు బి.జనార్దనరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, ఎంవీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పేదల కన్నీళ్లు తుడవడమే వైసీపీ ధ్యేయం

▸▸ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కన్నీళ్లు తుడవడమే వైసీపీ ధ్యేయమని రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం సంగివలస సభలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసిన ఘనత వైసీపీకి దక్కుతుందన్నారు. మరో మంత్రి సీదిరి అప్పలరాజు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. కాగా సభలో సీనియర్ నేతలకు ప్రసంగించే అవకాశం దక్కలేదు. మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు మాట్లాడకపోవడం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అసహనం తెప్పించింది.

'స్వచ్ఛత పక్వాడా' ర్యాలీ

మర్రిపాలెం, జనవరి 27: స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం మర్రిపాలెం వుడా కాలనీలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారి విశ్వాంజలి ఎం. గైక్వాడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మర్రిపాలెం వుడాకాలనీ, మర్రిపాలెం రైతుబజార్ తదితర ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది.పరిసరాల పరిశుభ్రతపై ఈనెల 16 నుంచి 31వరకు జనాలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సతీష్ మృతదేహం

లక్కవరపుకోట, జనవరి 27: అనుమానాస్పద స్థితిలో విశాఖకు చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం చందులూరు గ్రామ శివారులో జరిగింది. స్థానిక ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలివి.. విశాఖలోని ఆరిలోవకు చెందిన గొలగాని సతీష్ (22) శుక్రవారం రాత్రి చందులూరులో ఓ మతపరమైన కార్యక్రమం కోసం కొంతమందిని ఆటోలో తీసుకువెళ్లాడు. వారంతా ప్రచారం చేస్తుండగా తనకు నీరసంగా ఉందని, కార్యక్రమం ముగిశాక ఫోన్ చేయాలని వెనక్కి వచ్చేశాడు. అతడి ఆచూకీ తెలియక వారంతా కార్యక్రమం ముగించుకుని మరో వాహనంలో వెళ్లిపోయారు. సతీష్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం ఉదయం గాలించగా గ్రామ శివారున చిన్న చెరువు వద్ద అచేతనంగా కనిపించాడు. తల్లిదండ్రులు నారాయణరావు, వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

'సిద్ధం' సభలో జగన్ చెప్పినవన్నీ అబద్ధాలే..

▸▸ సభ కోసం వ్యవస్థలతో ఊడిగం

▸▸ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

సీతంపేట, జనవరి 27: తగరపువలస వద్ద సిద్ధం పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు వల్లించడం అన్యాయమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు విమర్శించారు. ఈ సభ కోసం వైసీపీ నేతలు మూడు రోజులుగా వ్యవస్థలను వాడుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తొలుత షర్మిల, తర్వాత విజయమ్మ, రాజశేఖరరెడ్డిలను కూడా పక్కన పెట్టేశారన్నారు. నాలుగేళ్లగా పోలవరం ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి చేయలేదని, విశాఖలో రాజధాని పేరు చెప్పి ఏం ఉద్ధరించారని ఆయన ప్రశ్నించారు. జగన్ పరిపాలన చూసి పారిశ్రామికవేత్తలు పారిపోయారన్నారు. ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనీసం పదిమందికి ఉద్యోగాలు కల్పించారా అని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఎందుకు మాట్లాడం లేదన్నారు. సిద్ధం సభలో తనకుతానే అర్జునుడని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అర్జునుడో.. రాక్షసుడో ప్రజలు త్వరలో తీర్పు ఇవ్వనున్నారన్నారు. మేనిఫెస్టోలో ఉన్న ప్రత్యేక హోదాపై ఎక్కడైనా మాట్లాడుతున్నారా... అని పంచకర్ల ప్రశ్నించారు. జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. సీఎం,ప్రభుత్వం బహిరంగ సభలు పేరిట ప్రజా ధనాన్ని వృధా చే స్తోందన్నారు.



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

సీఎం జగన్ సభ నేపథ్యంలో విపక్ష నేతలు ముందస్తు అరెస్టు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో సంగివలసలో నిర్వహించిన సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హజరవడంతో నగరంలోని విపక్ష నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జనసేనపార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌తోపాటు ఆర్టీసీ యూనియన్‌లకు చెందిన కొంతమందిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఉదయం ఆరుగంటలకే వారి నివాసాలకు వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఎం సభ ముగించుకుని తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న తర్వాత సాయంత్రం 6.30కు పోలీసులు వారందరినీ విడిచిపెట్టారు. భీమిలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుని వాల్తేరు అప్‌లాండ్స్‌లోని ఇంట్లో ఉదయం 5 నుంచి రాత్రి 7 త్రీటౌన్ పోలీసులు గృహనిర్బంధించారు.

వైసీపీ ఫ్లాప్ షో

... 3వ పేజీ తరువాయి

సూచించారు. కానీ, ఒక్కో బస్సులో కనీసం పది నుంచి పదిహేను మంది కూడా రాలేదు. కొన్ని బస్సులు ఐదారుగురితోనే వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రాంగణంలోకి వెళ్లేలా పోలీసులు ఒత్తిడి

ఇక స్థానిక నాయకులు ఒత్తిడి, ఇతర కారణాలతో సభకు వచ్చిన వారిలో చాలా మంది ప్రాంగణం లోపలకు వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 3.50 గంటల సమయంలో హెలికాప్టర్‌లో ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికి ప్రాంగణంలో పెద్దగా జనం లేరు. వందలాది మంది జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రాంగణం బయటే ఉండిపోయారు. సీఎం రావడం, ముఖ్య నాయకుల నుంచి పోలీసులకు ఆదేశాలు రావడంతో ప్రాంగణం బయట ఉన్న వారిని పోలీసులు రోప్ సహాయంతో బలవంతంగా లోపలకు పంపించారు. ప్రజలను ఎంత లోపలకు తరలించినా సభా ప్రాంగణం ఖాళీగానే కనిపించడంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు.

స్పందన అంతంతమాత్రమే..

తొలి ఎన్నికల సభ కావడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగానికి పార్టీ శ్రేణుల నుంచి గట్టి స్పందన ఉంటుందని భావించారు. అయితే మొదటి ఐదు నిమిషాలు మాత్రమే కేడర్‌లో స్పందన కనిపించింది. ఆ తరువాత సీఎం ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణం సైలెంట్‌గానే ఉంది. ప్రతిపక్షాలపై సీఎం చేసే విమర్శలకు ఆశించిన స్థాయిలో కేడర్ స్పందించలేదు.

ప్రసంగం ప్రారంభం కాకముందే బయటకు..

సీఎం జగన్మోహన్‌రెడ్డి 4.10 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. అయితే, సీఎం ప్రసంగం ప్రారంభం కావడానికి ముందే వందలాది మంది కార్యకర్తలు ప్రాంగణం నుంచి బయటకు వస్తూ కనిపించారు. ప్రసంగం ప్రారంభమైన తరువాత వందలాదిగా బయటకు వచ్చేశారు. సీఎం జగన్ సుమారు రెండు గంటలపాటు ప్రసంగించారు. ఆయన సుదీర్ఘ ఉపన్యాసంపై కేడర్‌లో అసహనం కనిపించింది. దీంతో చాలామంది బయటకు వెళ్లేందుకు యత్నించారు.

కేడర్‌తో మాటామంతీ ఏదీ..?

సంగివలస సభలో కేడర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటామంతీ ఉంటుందని వైసీపీ నాయకులు చెప్పారు. కానీ, సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగానికి ప్రాధాన్యం ఇచ్చారు గానీ కేడర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. సీఎంతో మాట్లాడాలని భావించిన వందలాది మంది కార్యకర్తలను ఇది అసంతృప్తికి గురిచేసింది. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, అసంతృప్తులు బయటపడతాయన్న ఉద్దేశంతోనే మాటామంతీకి సీఎం దూరంగా ఉండిపోయారని అంటున్నారు.

ప్రయాణికులు పడిగాపులు

... 3వ పేజీ తరువాయి

తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నేతలు సభ కోసం బస్సులు కోరినంత మాత్రాన ప్రయాణికులను అవసరాలను పట్టించుకోకపోవడమేమిటంటూ అసహనం వ్యక్తంచేశారు. వైసీపీ నేతలైనా అధికారం ఉంది కదా అని చెప్పి ఆర్టీసీ అధికారులను భయపెట్టి బస్సులు తీసుకోకపోతే..ప్రైవేటు వాహనాలను సమకూర్చుకోవచ్చు గదా...అనే వ్యాఖ్యలు వినిపించాయి.

నా...నా...నా...నా...

... 3వ పేజీ తరువాయి

బొమ్మలే కనిపించాలని నేతలు, అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెట్టి..ఆఖరుకు రోడ్డు పక్క దుకాణాలపై కూడా జగన్ బొమ్మ, పార్టీ రంగులు వేయించుకున్న ఆయన..దానిని మరోలా ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు.తాను చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏ ఇంటికి వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తుందని చెప్పారు. 'ఎక్కడికి వెళ్లినా వైఎస్ఆర్‌సీపీనే..జగన్ మార్కే' కనిపిస్తుందని ఒకటికిపదిసార్లు చెప్పుకొన్నారు. దానికీ పలువురు నవ్వుకున్నారు.

చిక్కటి చిరునవ్వులు: జగన్ అన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వకు, తాతకు, అమ్మకు, అక్కకు 'చిక్కటి చిరునవ్వు'తో చెప్పాలని ఉద్బోధించారు. దానికి కూడా సభలో ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

రండి బాబు... రండి

... 3వ పేజీ తరువాయి

రూ.200, బిర్యానీ ప్యాకెట్, క్వార్టర్ బాటిల్, మరికొన్నిచోట్ల రూ.300, బిర్యానీ ప్యాకెట్ అందజేశారు. ముందుగా ఇస్తే తీసుకుని ఇళ్లకు వెళ్లిపోతారని భావించిన నేతలు...బస్సు, ఆటో సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న తరువాత మాత్రమే సొమ్ములు పంపిణీ చేశారు. ఫుడ్ ప్యాకెట్లు ఇచ్చే కవర్లపై నియోజకవర్గ నాయకుల పేర్లు ముద్రించారు.

జీవీఎంసీ 24, 25 వార్డుల పరిధిలో ఎవరూ రావడానికి ఆసక్తి చూపించకపోవడంతో చివరికి డ్వాక్రా మహిళలను సభకు తరలించారు. అలాగే సచివాలయాల పరిధిలో వలంటీర్లను బస్సులు ఎక్కించారు.

విశాఖ డాక్టర్‌కు వ్యాఘ్రేశ్వరుడు అవార్డు



అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ వి.అరుణ్‌కుమార్‌కు ఏపీ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వ్యాఘ్రేశ్వరుడు గోల్డ్ మెడల్ (అవార్డు)ను శనివారం తిరుపతిలో ప్రదానం చేసింది. ఎండోస్కోపీ ద్వారా వెన్నెముకకు కొత్త తరహా సర్జరీ చేయడంలో నైపుణ్యం సాధించినందుకుగాను ఈ అవార్డును ప్రకటించారు. అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ డాక్టర్ల చేతుల మీదుగా అరుణ్‌కుమార్ అవార్డును అందుకున్నారు.

5, 6 తేదీల్లో భాషల్లో సాంకేతిక పదాలపై జాతీయ సదస్సు

జ్ఞానాపురం, జనవరి 27: స్థానిక సెయింట్ జో సెఫ్ కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్ న్యూఢిల్లీ సౌజన్యంతో ఫిబ్రవరి 5,6 తేదీల్లో 'భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యత' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు విచ్చేసి హిందీ, తెలుగు భాషల్లో విద్యాబోధన, వైజ్ఞానిక సాంకేతిక పదజాలం ఆవశ్యకతపై ప్రసంగిస్తారని సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్ దీప్తి,డాక్టర్ గౌరినాయుడు, సిస్టర్‌జైన్, థామస్, డాక్టర్ భాస్కర సుధ పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

దొండపర్తి, జనవరి 27: గ్రేటర్ 27వ వార్డు పరిధిలో పూడికతీత పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ శనివారం కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు వార్డులో పారిశుధ్య సమస్యలున్న ప్రాంతాలను పర్యటించారు. ద్వారకానగర్, దొండపర్తి ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించారు. దొండపర్తి శ్రీ సూర్య జంక్షన్ నుంచి కుమ్మరి వీధి వరకు ఉన్న డ్రైన్‌లోని మురుగు నీరు రోడ్డు పైకి రావడంతో కార్పొరేటర్ వీరారావు స్పందించారు. ఎక్సకవేటర్‌ను రప్పించి పూడిక తీయించారు. జోన్-5 ఏఈ అర్చనను కార్పొరేటర్ పిలిపించి డ్రైన్ మరమ్మతులు చేయించిన తర్వాతే ఫుట్‌పాత్ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, శానిటరీ సిబ్బంది ఉన్నారు.



ఉభయ దేవేరులతో పూజలందుకున్న శ్రీవారు

ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం జరిపారు. వేకువ జామున ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకించాక పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి తోమాలసేవ చేసి పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి పువ్వులతో సహస్రనామార్చన, నక్షత్ర హారతి ఇచ్చాక శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలోని ఆలయంలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలోని స్వయంభు వేంకటేశ్వరాలయంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారిని తులసీమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో చేపట్టిన అన్నప్రసాద వితరణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, పి.నానాజీ, సత్యవతి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో కార్పొరేటర్ పర్యటన

సింధియా, జనవరి 27: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంగినగర్‌లో శనివారం కార్పొరేటర్ గల్లా చిన్నా పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు తమ ఇళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవని, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఆయా సమస్యలను పరిష్కరించాలని పలువురు మహిళలు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు బొండా కృష్ణ, అనిల్, తదితరులు ఉన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పరస

నరవ, జనవరి 27: కోటనరవ గ్రామంలో కొలువుదీరిన పైడితల్లమ్మ అమ్మవారి పరసను శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువ జామున పూజలు చేశారు. వందలాది మంది భక్తులు పైడితల్లమ్మను దర్శించుకునేందుకు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం పరస కార్యక్రమాన్ని చేపట్టారు.

95వ వార్డులో దుర్గమాంబ, బంగారుమాంబ..

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం, దుర్గానగర్, గవరపాలెం కాలనీవాసుల ఆరాధ్య దేవతలు దుర్గమాంబ, బంగారుమాంబ పరసలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్లను ఊరేగించారు. పరసల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అగనంపూడి, జనవరి 27: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ వేపచెట్టు జంక్షన్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్, అసోసియేషన్ ప్రతినిధులు జి.బోసుబాబు, బత్తుల కాళిదాసు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళదుంపలు 17, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 24, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 100
ఫారం ధర	-- 120
విత్ స్కిన్	-- 210
స్కిన్‌లెస్	-- 220



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి



'బాబు ష్యూరిటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

టీడీపీతోనే బీసీల సమగ్రాభివృద్ధి

మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి

పెందుర్తి, జనవరి 27: బీసీల సమగ్రాభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సుజాతనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి మండల, వార్డులకు సంబంధించిన జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని నీరుగార్చిందని, వారిని అని విధాలుగా మోసగించిందని విమర్శించారు. జగన్ బీసీల ద్రోహి అని ఆరోపించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సాధించాలంటే చంద్రబాబు మళీల ముఖ్యమంత్రి కావాలని, అందుకు బీసీలంతా వెన్నంటి ఉండాలని కోరారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. సీఎం జగన్ బీసీలను అణగదొక్కారన్నారు. బీసీల సంక్షేమం, సమస్యలపై పలువురు నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముందుగా జయహో బీసీ కార్యక్రమానికి బండారు ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సేనాపతి శంకరవు, బల్ల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, నాయకులు దాట్ల మధు, కె.సుందరరావు, హరగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిత: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు టీడీపీ తొలి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీని పాతాళానికి తొక్కాలన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు మితిరెడ్డి శంకర్, పూడి భాస్కరరావు, రామ్మోహన్‌నాయుడు, డి.ఈశ్వరరావు, కృష్ణారావు, జనసేన నాయకుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల డిమాండ్

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనకు మూడేళ్లు



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27: స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని, కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలని చూస్తే సహించేది లేదని ఉక్కు పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన చేసి శనివారం నాటికి మూడేళ్లయిన నేపథ్యంలో ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పట్ల కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, మూడేళ్లగా ఉద్యమం చేస్తున్నప్పటికీ కేంద్రం వెనకడుగు వేయకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు తాము ఎంతటి ఉద్యమాలకైనా సిద్ధమని, అవసరమైతే ప్రాణ త్యాగాలకు సంసిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జి.గణపతిరెడ్డి. వరసాల శ్రీనివాసరావు, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రదర్శన

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ టీడీపీ మండల నాయకులు శనివారం సాయంత్రం నెల్లిముక్కు జంక్షన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. సేవ్ స్టీల్‌ప్లాంట్, విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వందలాది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు దొమ్మేటి అప్పారావు, ఎం.పెంటయ్య, కె.అప్పలరాజు, రామునాయుడు, ఎస్.శ్రీనివాసరావు, సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన బస్సులు

ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రైవేటు వాహనాల్లో గమ్య స్థానాలకు చేరిక

గాజువాక, జనవరి 27: భీమిలి నియోజకవర్గం సంగివలసలో శనివారం జరిగిన సీఎం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు, కార్మికులు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం తొమ్మిది గంటల వరకు కొన్ని బస్సులను నడిపినప్పటికీ ఆ తర్వాత బస్సులు రాకపోవడంతో పలు ప్రాంతాల్లోని బస్టాపులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. స్టీల్‌ప్లాంట్, ఆటోనగర్, తదితర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వేలాది మంది కార్మికులు, ఇతర ఉద్యోగులు పాత గాజువాక కేంద్రంగా రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఎంతోమంది విద్యార్థులు గాజువాక పరిసరాల నుంచి నగరంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు రోజూ రాకపోకలు సాగిస్తారు. అయితే ఎంతసేపు వేచివున్నా బస్సులు రాకపోవడం, ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలించినట్టు తెలుసుకున్న ప్రయాణికులు ఉసూరోమంటూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆటోలకు మంచి గిరాకీ ఏర్పడింది.



పాత గాజువాక కూడలిలో ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు



ఎన్ఎస్‌టీఎల్ డబుల్ రోడ్డులో ఉంచిన అమలాపురానికి చెందిన బస్సులు

పెందుర్తి: సీఎం జగన్ పర్యటన పుణ్యమాని ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. శనివారం సంగివలసలో జరిగిన సీఎం జగన్ సభకు జనసమీకరణ చేసేందుకు ఆర్టీసీ బస్సులు ఉపయోగించడంతో సామాన్య ప్రజలు, విద్యార్థులు నానాపాట్లు పడ్డారు. అత్యధికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. కాగా సాయంత్రం సీఎం సభ ముగిశాక భీమిలి నుంచి పలు వాహనాలను పెందుర్తి బైపాస్ మీదుగా స్థానిక జంక్షన్ నుంచి వెళ్లడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

ఎన్.ఎ.డి.జంక్షన్: సీఎం సభకు 90, 52వ వార్డులకు చెందిన ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించారు. ఆయా ప్రాంతాల ప్రజలను తరలించేందుకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బస్సులను వినియోగించారు. అలాగే సింహాచలం డిపోకు చెందిన 53 బస్సులను కేటాయించారు. ముఖ్యమంత్రి సభ కోసం ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు.

ప్రజలను మభ్యపెట్టే నాయకులకు బుద్ధి చెబుతాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జనవరి 27: ఉత్తరాంధ్ర సంజీవని అయిన ఉక్కు కర్మాగార పరిరక్షణకు కృషి చేయని ప్రస్తుత పాలకులకు ఉత్తరాంధ్ర బహిరంగ సభలను నిర్వహించే అర్హత ఉందా అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,080వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కపట నాటకాలు, పాదయాత్రలు చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న పరదాల నాయకుల పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలకు ముప్పు వాటిల్లినప్పుడు ప్రజలు ఐక్య ఉద్యమాలు చేసి పాలకులకు బుద్ధి చెబుతారన్నారు. లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు సిద్ధపడిన కేంద్రానికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఉక్కు ఉద్యమాన్ని గ్రామ స్థాయికి తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కోసం ఏం చేశావు జగన్?

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

పెందుర్తి, జనవరి 27: విశాఖ పాలనా రాజధాని అంటూ.. వెనకబడిన ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తామంటూ ప్రగల్భాలు పలికిన సీఎం జగన్మోహనరెడ్డి అసలు ఉత్తరాంధ్ర కోసం ఏం చేశారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉత్తరాంధ్ర కోసం ఒక పరిశ్రమనైనా తెచ్చారా, విశాఖకు ఏం చేశారన్నారు. సుజాతనగర్‌లో శనివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌పై ఆయన ధ్వజమెత్తారు. విశాఖకు కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమలను తీసుకురాకపోగా నగరంలోని విలువైన ఆస్తులను తనాఖా పెట్టారని, ప్రకృతి సంపదైన రుషికొండకు అరగుండు చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు, ఫ్లైఓవర్‌లకు శంకుస్థాపనలు చేస్తే వాటికే జగన్ రివర్సింగ్ చేశారని ఎద్దేవా చేశారు. ఎవరికో పుట్టిన బిడ్డకు ముద్దుపేరు పెట్టినట్టుగా జగన్ యవ్వారం ఉందన్నారు. విశాఖ కోసం టీడీపీ ప్రభుత్వం ఏమి చేసిందో గణాంకాలతో సహా వివరిస్తానని, ఇందుకోసం ముఖాముఖికి సీఎం గానీ వైసీపీ నేతలు కానీ చర్చకు వస్తారా అని బండారు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంటులో ఉక్కు అంశాన్ని ఎంపీలు ప్రస్తావించాలి'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27: రానున్న పార్లమెంటు సమావేశాల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని రాష్ట్ర ఎంపీలు ప్రస్తావించాలని, ఇదే ప్రధాన ఎజెండాగా మారాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎంపీలు ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించడం లేదన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంటే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినట్టేనని, ఈ అంశంపై ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం స్పందించాలన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. సమావేశంలో నాయకులు నరేంద్ర, చీపురుపల్లి శ్రీనివాస్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ఆటోనగర్, జనవరి 27: జనం వద్దకు జనసేన అంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజల తరపున పోరాటానికి మేము సిద్ధమంటూ ఆదివారం గాజువాకలో చేపట్టనున్న భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు కోరారు. 70వ వార్డు ఎల్‌వీనగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో శనివారం జరిగిన గాజువాక నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని గద్దె దించడానికి జనసేన, టీడీపీలు ప్రజలు వద్దకు వెళ్లి వైసీపీ పాలనలో ప్రజలు ఏమి కోల్పోయారో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు లంకల మురళీదేవి, కరణం కనకారావు, కాదా శ్రీను, కేవీ సూరిబాబు, ఎస్.కనకరాజు, గంధం వెంకటరావు, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని సేవా దృక్పథంతో చూడాలి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27: వైద్య రంగంలో ఉన్న ఉద్యోగాలను కేవలం ఆదాయాన్నిచ్చే వృత్తిగా కాకుండా సమాజ సేవా దృక్పథంలో చూడాలని కిమ్స్ ఐకాన్ సీఈవో జి.సుఖేష్‌రెడ్డి అన్నారు. షీలానగర్‌లో శనివారం నిర్వహించిన బొల్లినేని మెడిస్కిల్ కల్చరల్ ఫెస్ట్‌ను కిమ్స్ ఐకాన్ రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.బాలాజీతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైద్య రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ఈడీ సీహెచ్ నాగేశ్వరరావు, వైద్యులు హరిప్రసాద్, రవికృష్ణ, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఉక్కు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. 60 ఏళ్ల పైబడిన కార్మికులను విధుల నుంచి తొలగించేటప్పుడు వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్‌కు స్వాగతం



జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

గోపాలపట్నం, జనవరి 27: భీమిలి నియోజకవర్గం తగరపువలస సమీపంలోని సంగివలసలో జరిగిన బహిరంగ సభలో పాల్గొనడానికి విచ్చేసిన సీఎం జగన్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం మధ్యాహ్నం 3.12 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏసీపీ నరసింహమూర్తి, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన హెలీకాప్టర్‌లో మంత్రులు, కలెక్టర్‌తో కలిసి సభాస్థలికి చేరుకున్నారు.

వీడ్కోలు..

సంగివలసలో బహిరంగ సభ ముగిశాక సీఎం జగన్ సాయంత్రం 5.55 గంటలకు హెలీకాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు గృహ నిర్బంధం



హౌస్ అరెస్టులో ఉన్న అనంతలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27: సీఎం జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. శనివారం ఉదయాన్నే ఇద్దరు మహిళా పోలీసులు అక్కిరెడ్డిపాలెంలోని అనంతలక్ష్మి ఇంటికి చేరుకుని హౌస్ అరెస్టు చేస్తున్నట్టు ఆమెకు తెలిపారు. సీఎం జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా తాము గృహ నిర్బంధం చేస్తున్నట్టు పోలీసులు స్పష్టం చేయడంతో అనంతలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని ఆమె పోలీసు అధికారులకు తెలిపినా వారు అంగీకరించలేదు. సీఎం విశాఖ వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేయడం ఆయన నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గాజువాక, జనవరి 27: సుమారు ఐదేళ్లుగా రాష్ట్రంలోని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంతో కుమ్మక్కైన వైసీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంలో కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా అందరూ పని చేయాలన్నారు. వైసీపీ పెద్దలు అసలు విశాఖ అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఉషారాణి, ప్రభాకరరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవిత ఖైదీలకు లభించని క్షమాభిక్ష

విశాఖపట్నం జనవరి 27: నగరంలోని కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ లకు ఈ ఏడాది క్షమాభిక్ష రాకపోవడంతో ఖైదీలతో పాటు వారి కుటుంబీకులు నిరాశకు గురయ్యారు. గణతంత్ర దినోత్సవం రోజున జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో సత్ప్రవర్తన గల వారిని విడుదల చేస్తుంటారు. ఈమేరకు ఈ ఏడాది 21 మంది ఖైదీల విడుదలకు జైలు అధికారులు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి రాకపోవడంతో అధికారులు ఖైదీలను విడుదల చేయలేదు. ఈవిషయం తెలియని ఖైదీల బంధువులు ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి జైలు వద్దకు వచ్చి పడిగాపులు కాసారు. అధికారులు ఖైదీలను విడుదల చేయకపోవడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు.

ఏరియా ఆస్పత్రి డాక్టర్ భారతికి సన్మానం



డాక్టర్ భారతిని సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి, జనవరి 27: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని శనివారం స్థానిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేస్తున్న భారతిని ప్రభుత్వం గుర్తించి ప్రశంసాపత్రాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నక్కా రమణబాబు, దానబోయిన నీలకంఠరావు, ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ స్నేహాకు అభినందనలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న డా.స్నేహ

గోపాలపట్నం: స్థానిక 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ స్నేహ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న డాక్టర్ స్నేహను ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

దేవస్థానం సమస్యపై నేడు శాంతి ర్యాలీ

వేపగుంట, జనవరి 27: వేపగుంట పరిసర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న దేవస్థానం, వుడా భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక యువకులు ఆదివారం వేపగుంటలో చేపడుతున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. సుమారు 30 ఏళ్లగా వేపగుంట పరిసర ప్రాంత ప్రజలు దేవస్థానం భూసమస్యతో, వుడా భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలివ్వడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు.

పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

గాజువాక, జనవరి 27: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ పి.సింహాచలం సూచించారు. జోనల్ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ ప్రజలు ఎలాంటి ఇబ్బందులక గురికాకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, కాలువల్లో మురుగు నీరు దిగువ ప్రాంతాలకు పారేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27: గ్రేటర్ 69వ వార్డు పరిధిలోని తుంగ్లాం, నాతయ్యపాలెం శ్మశానవాటిక అభివృద్ధి పనులను, తుంగ్లాం కమ్యునిటీ హాల్ నిర్మాణాన్ని శనివారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. అయన వెంట స్థానిక నాయకులు ప్రసాద్, గిడుతూరి అప్పారావు, తదితరులు ఉన్నారు.

30న దుకాణాలకు వేలం

జ్ఞానాపురం, జనవరి 27: జోన్-5 పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీ అయిన జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మంటపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలం పాటను నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ తెలిపారు. గుల్లలపాలెం, సంజీవయ్యకాలనీ, అశోక్‌నగర్‌లోని దుకాణాలకు, మాధవదారలోని మాధవస్వామి కళ్యాణమండపం, కంచరపాలెం బ్రిడ్జి నుంచి 104 వరకు, అక్కయ్యపాలెంరోడ్డు సైడ్ మార్కెట్,జనతాకాలనీ వారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ సైడ్ మార్కెట్లకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే ఆస్పత్రిలో ఫొటోథెరపీ యూనిట్ ప్రారంభం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ

విశాఖపట్నం, జనవరి 27: వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శిశు వార్మర్ కమ్ ఫొటో థెరపీ యూనిట్‌ను శనివారం వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు రైల్వే ఆసుపత్రిలో ఉత్తమ చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ యూనిట్‌ను వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం విరాళంగా అందించినట్టు పేర్కొన్నారు. ఈ ఆసుపత్రిలో నెలకు సగటున 15 నుంచి 20 వరకు డెలివరీ కేసులు చేస్తున్న నేపథ్యంలో ఈ యూనిట్‌తో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ఈకార్వో ప్రతినిధులు మధుస్మిత సాహు, కవితా గుప్తా, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆరోకే తిరుఅరుజ్యోతి పాల్గొన్నారు.

న్యాయస్థానాలు దేవాలయాలతో సమానం

▸▸ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

విశాఖపట్నం/డాబాగార్డెన్స్ జనవరి 27: న్యాయస్థానాలు దేవాలయాలతో సమానమైనవని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు అన్నారు. న్యాయమూర్తిగా అందించిన విశిష్ట సేవలకు గాను పోర్టుసిటీ రోటరీ క్లబ్ జస్టిస్ సోమయాజులు దంపతులను శనివారం ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. రాక్‌డేల్ హోటల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ సాధారణ ప్రజలు న్యాయస్థానాలకు వచ్చి న్యాయమూర్తుల నుంచి నిజమైన తీర్పుల కోసం ప్రార్థిస్తారన్నారు. కోర్టులు త్వరితంగా కేసులు పరిష్కరించడం వలన సామాన్యుని సమయం, డబ్బు ఆదాచేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. విశ్రాంత ఆచార్యులు పిల్లా వెంకటరమణ రాసిన ప్రశంసాపత్రాన్ని సభ్యులు ప్రదానం చేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు జీఎస్ రాజు, రొటేరియన్ ఎస్ఏ రామ్మోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.కృష్ణారావు, కార్యదర్శి ఎన్ఎస్ఎన్ రాజు, పూర్వ రోటరీ గవర్నర్ డి.రాజగోపాలరెడ్డి, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కేవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుకు అవార్డు అందజేస్తున్న సభ్యులు

బుల్లయ్య కళాశాలలో టెక్ ఫెస్ట్ మోడల్ ఎక్స్‌పో

సీతంపేట, జనవరి 27: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు టెక్ ఫెస్ట్ మోడల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ కె.సోమేశ్వర రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఇంగ్లీష్ స్మార్ట్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రికల్ కార్ తదితర నమూనాలను పరిశీలించారు. తయారీ, వాటి అవశ్యకతపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.


నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ మధుకుమార్, కళాశాల ప్రతినిధులు

బాక్సింగ్‌లో మల్లికకు రజతం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 27: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఏయూ నుంచి ప్రాతినిథ్యం వహించిన ఎస్‌జీజేఎస్ మల్లిక సాయి రజత పతకం సాధించింది. పంజాబ్‌లోని జలంధర్ లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన టోర్నీలో మల్లిక 50-52 కిలోల కేటగిరీలో రజతం కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి శనివారం ఆమెను అభినందించారు.


మల్లికను అభినందిస్తున్న వీసీ

ఘనంగా హజ్రత్ తాజుద్దీన్ బాబా జయంత్యుత్సవం

మర్రిపాలెం, జనవరి 27: మర్రి పాలెం జాకీరు హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ అధ్వర్యంలో హజ్రత్ తాజుద్దీన్ బాబా 163వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ముస్లిం సోదరులు, చిన్నారులునమాజు అచరించారు. మజీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించి పాతేహ నిర్వహించారు. అనంతరం కాలనీలో దావత్ నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి అన్సర్‌వల్లి పర్యవేక్షించారు.


వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జనవరి 27: కుర్దా డివిజన్‌లో నిర్మాణ పనుల నేపథ్యంలో రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 31న తిరుపతి-పూరి (17480) నిర్ణీత సమయం కన్నా నాలుగు గంటలు, చెన్నై సెంట్రల్-షాలిమార్ (22826) రెండు గంటలు, తిరునెలివేలి-పురిలియా(22606) 4.15 గంటలు, పాండిచ్చేరి-హౌరా (12868) 2.45 గంటలు, చెన్నై-హౌరా (12840) 2.30 గంటలు, సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ (17016) 2.45 గంటలు ఆలస్యంగా బయలుదేరనున్నాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (12830) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరనుంది.

30న గీతంలో ఎడుయూత్ మీట్

ఎండాడ/సాగర్‌నగర్, జనవరి 27: సమాజంలో మానవ విలువలను పెంచడానికి కలిసి నడుద్దాం... కలిసి ఎదుగుదాం.. ముందుకు సాగుదాం.. నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా ఈనెల 30న గీతంలో ఎడుయూత్ మీట్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్ తెలిపారు. వర్సిటీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి 25 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. అనంతరం మీట్‌కి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీఎస్సార్ నిధులతో మొక్కల పెంపకం చేపట్టండి

▸▸ అధికారులకు ఎన్జీటీ సభ్యుడు అహ్మద్ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద పరిశ్రమలు ఇచ్చిన నిధులను పర్యావరణ పరిరక్షణకు దోహద పడేలా మొక్కల పెంపకం, నదుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ సభ్యుడు డాక్టరు అఫ్రోజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జిల్లా పర్యావరణ ప్రణాళిక అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యత కింద పరిశ్రమలు ఇచ్చే నిధులను ఇతర అవసరాలకు మళ్లించవద్దని స్పష్టంచేశారు. జేసీ కేఎస్ విశ్వనాథన్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా అటవీ అధికారి అనంతశంకర్ జిల్లాలో చిత్తడి నేలల వివరాలు, పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ నగరంలో రోజూ ఉత్పత్తి అయ్యే మురుగు జలాలను శుద్ధిచేసి విడుదలచేస్తున్నామన్నారు. జీవీఎంసీ చీఫ్ ఇంజనీరు రామకృష్ణరాజు నగరంలో ప్రస్తుతం మురుగు జలాల శుద్ధిప్లాంట్ సామర్థ్యం, భవిష్యత్తులో శతశాతం శుద్ధికి ప్రణాళిక అమలుచేస్తామన్నారు. సమీక్షలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు జి.నాగిరెడ్డి, ఏఈ ఎ.శ్రీరామచంద్రమూర్తి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్జీటీ సభ్యుడు అఫ్రోజ్ అహ్మద్

ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో డ్రోన్ టెక్నాలజీస్ ఎంఓయూ

కంచరపాలెం, జనవరి 27 : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్, సంస్థ ప్రతినిధులు శనివారం ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం డ్రోన్ టెక్నాలజీ కేంద్రం ప్రతినిధులు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణను అందించనున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కె.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి ఈ ఒప్పందం చక్కని అవకాశంగా మారుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీస్ కేంద్రం సీఈవో సతీశ్, స్టీల్ ప్లాంట్ మాజీ జనరల్ డైరెక్టర్ ఒ.రామ్మోహన్‌రావు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ముగిసిన డీఆర్ఎం కప్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 27:రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన డీఆర్ఎం కప్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ పురుషుల 35ప్లస్ డబుల్స్‌లో ఎంవీఎల్ఎన్.రాజు, విశ్వేశ్వరరావు జంట విజేతలుగా నిలిచారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్యఅతిథి గా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, సీనియర్ డీఈ (కో ఆర్డినేషన్)మహరాణా, రెడ్డి శ్రీనివాసరావు, రక్షణకుమార్ పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న డీఆర్ఎం

నేడు వాకర్స్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, జనవరి 27 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎన్ఆర్ఐ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు హాజరై గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల వ్యాధులకు తనిఖీలు చేస్తారన్నారు. ఈ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు

▸▸ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సిరిపురం, జనవరి 27: ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు పాఠశాలలకు నష్టం కలుగజేయాలన్న ఆలోచన ఎప్పుడూ లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను నడుపుతున్నామని, అందులో ఎటువంటి దురుద్దేశం లేదన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ, ఆ సంఘం రాష్ట్ర (అపూస్మా) అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఈకార్యక్ర మం లో డీఈఓ చంద్రకళ, అపూస్మా రాష్ట్రస్థాయి కమిటీ ప్రతినిధులు బి.జనార్దనరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, ఎంవీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సీఎం జగన్ సభ నేపథ్యంలో విపక్ష నేతలు ముందస్తు అరెస్టు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో సంగివలసలో నిర్వహించిన సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవడంతో నగరంలోని విపక్ష నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జనసేనపార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌తోపాటు ఆర్టీసీ యూనియన్‌లకు చెందిన కొంతమందిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఉదయం ఆరుగంటలకే వారి నివాసాలకు వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఎం సభ ముగించుకుని తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న తర్వాత సాయంత్రం 6.30కు పోలీసులు వారందరినీ విడిచిపెట్టారు. భీమిలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుని వాల్తేరు అప్‌లాండ్స్‌లోని ఇంట్లో ఉదయం 5 నుంచి రాత్రి 7 త్రీటౌన్ పోలీసులు గృహనిర్బంధించారు.

వైసీపీ ఫ్లాప్ షో

... 3వ పేజీ తరువాయి

సూచించారు. కానీ, ఒక్కో బస్సులో కనీసం పది నుంచి పదిహేను మంది కూడా రాలేదు. కొన్ని బస్సులు ఐదారుగురితోనే వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రాంగణంలోకి వెళ్లేలా పోలీసులు ఒత్తిడి

ఇక స్థానిక నాయకులు ఒత్తిడి, ఇతర కారణాలతో సభకు వచ్చిన వారిలో చాలా మంది ప్రాంగణం లోపలకు వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 3.50 గంటల సమయంలో హెలికాప్టర్‌లో ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికి ప్రాంగణంలో పెద్దగా జనం లేరు. వందలాది మంది జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రాంగణం బయటే ఉండిపోయారు. సీఎం రావడం, ముఖ్య నాయకుల నుంచి పోలీసులకు ఆదేశాలు రావడంతో ప్రాంగణం బయట ఉన్న వారిని పోలీసులు రోప్ సహాయంతో బలవంతంగా లోపలకు పంపించారు. ప్రజలను ఎంత లోపలకు తరలించినా సభా ప్రాంగణం ఖాళీగానే కనిపించడంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు.

స్పందన అంతంతమాత్రమే..

తొలి ఎన్నికల సభ కావడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగానికి పార్టీ శ్రేణుల నుంచి గట్టి స్పందన ఉంటుందని భావించారు. అయితే మొదటి ఐదు నిమిషాలు మాత్రమే కేడర్‌లో స్పందన కనిపించింది. ఆ తరువాత సీఎం ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణం సైలెంట్‌గానే ఉంది. ప్రతిపక్షాలపై సీఎం చేసే విమర్శలకు ఆశించిన స్థాయిలో కేడర్ స్పందించలేదు.

ప్రసంగం ప్రారంభం కాకముందే బయటకు..

సీఎం జగన్మోహన్‌రెడ్డి 4.10 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. అయితే, సీఎం ప్రసంగం ప్రారంభం కావడానికి ముందే వందలాది మంది కార్యకర్తలు ప్రాంగణం నుంచి బయటకు వస్తూ కనిపించారు. ప్రసంగం ప్రారంభమైన తరువాత వందలాదిగా బయటకు వచ్చేశారు. సీఎం జగన్ సుమారు రెండు గంటలపాటు ప్రసంగించారు. ఆయన సుదీర్ఘ ఉపన్యాసంపై కేడర్‌లో అసహనం కనిపించింది. దీంతో చాలామంది బయటకు వెళ్లేందుకు యత్నించారు.

కేడర్‌తో మాటామంతీ ఏదీ..?

సంగివలస సభలో కేడర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటామంతీ ఉంటుందని వైసీపీ నాయకులు చెప్పారు. కానీ, సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగానికి ప్రాధాన్యం ఇచ్చారు గానీ కేడర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. సీఎంతో మాట్లాడాలని భావించిన వందలాది మంది కార్యకర్తలను ఇది అసంతృప్తికి గురిచేసింది. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, అసంతృప్తులు బయటపడతాయన్న ఉద్దేశంతోనే మాటామంతీకి సీఎం దూరంగా ఉండిపోయారని అంటున్నారు.

ప్రయాణికులు పడిగాపులు

... 3వ పేజీ తరువాయి

తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నేతలు సభ కోసం బస్సులు కోరినంత మాత్రాన ప్రయాణికులను అవసరాలను పట్టించుకోకపోవడమేమిటంటూ అసహనం వ్యక్తంచేశారు. వైసీపీ నేతలైనా అధికారం ఉంది కదా అని చెప్పి ఆర్టీసీ అధికారులను భయపెట్టి బస్సులు తీసుకోకపోతే..ప్రైవేటు వాహనాలను సమకూర్చుకోవచ్చు గదా...అనే వ్యాఖ్యలు వినిపించాయి.

నా...నా...నా...నా...

... 3వ పేజీ తరువాయి

బొమ్మలే కనిపించాలని నేతలు, అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెట్టి..ఆఖరుకు రోడ్డు పక్క దుకాణాలపై కూడా జగన్ బొమ్మ, పార్టీ రంగులు వేయించుకున్న ఆయన..దానిని మరోలా ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు.తాను చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏ ఇంటికి వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తుందని చెప్పారు. 'ఎక్కడికి వెళ్లినా వైఎస్ఆర్‌సీపీనే...జగన్ మార్కే' కనిపిస్తుందని ఒకటికిపదిసార్లు చెప్పుకొన్నారు. దానికీ పలువురు నవ్వుకున్నారు.

చిక్కటి చిరునవ్వులు: జగన్ అన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వకు, తాతకు, అమ్మకు, అక్కకు 'చిక్కటి చిరునవ్వు'తో చెప్పాలని ఉద్బోధించారు. దానికి కూడా సభలో ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

రండి బాబు... రండి

... 3వ పేజీ తరువాయి

రూ.200, బిర్యానీ ప్యాకెట్, క్వార్టర్ బాటిల్, మరికొన్నిచోట్ల రూ.300, బిర్యానీ ప్యాకెట్ అందజేశారు. ముందుగా ఇస్తే తీసుకుని ఇళ్లకు వెళ్లిపోతారని భావించిన నేతలు...బస్సు, ఆటో సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న తరువాత మాత్రమే సొమ్ములు పంపిణీ చేశారు. ఫుడ్ ప్యాకెట్లు ఇచ్చే కవర్లపై నియోజకవర్గ నాయకుల పేర్లు ముద్రించారు.

జీవీఎంసీ 24, 25 వార్డుల పరిధిలో ఎవరూ రావడానికి ఆసక్తి చూపించకపోవడంతో చివరికి డ్వాక్రా మహిళలను సభకు తరలించారు. అలాగే సచివాలయాల పరిధిలో వలంటీర్లను బస్సులు ఎక్కించారు.

విశాఖ డాక్టర్‌కు వ్యాఘ్రేశ్వరుడు అవార్డు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ వి.అరుణ్‌కుమార్‌కు ఏపీ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వ్యాఘ్రేశ్వరుడు గోల్డ్ మెడల్ (అవార్డు)ను శనివారం తిరుపతిలో ప్రదానం చేసింది. ఎండోస్కోపీ ద్వారా వెన్నెముకకు కొత్త తరహా సర్జరీ చేయడంలో నైపుణ్యం సాధించినందుకుగాను ఈ అవార్డును ప్రకటించారు. అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ డాక్టర్ల చేతుల మీదుగా అరుణ్‌కుమార్ అవార్డును అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

5, 6 తేదీల్లో భాషల్లో సాంకేతిక పదాలపై జాతీయ సదస్సు

జ్ఞానాపురం, జనవరి 27: స్థానిక సెయింట్ జో సెఫ్ కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిత్వ శాఖ సైం టిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్ న్యూఢిల్లీ సౌజన్యంతో ఫిబ్రవరి 5,6 తేదీల్లో 'భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యత' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు విచ్చేసి హిందీ, తెలుగు భాషల్లో విద్యాబోధన, వైజ్ఞానిక సాంకేతిక పదజాలం ఆవశ్యకతపై ప్రసంగిస్తారని సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్ దీప్తి,డాక్టర్ గౌరినాయుడు, సిస్టర్‌జైన్, థామస్, డాక్టర్ భాస్కర సుధ పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

దొండపర్తి, జనవరి 27: గ్రేటర్ 27వ వార్డు పరిధిలో పూడికతీత పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ శనివారం కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు వార్డులో పారిశుధ్య సమస్యలున్న ప్రాంతాలను పర్యటించారు. ద్వారకానగర్, దొండపర్తి ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించారు. దొండపర్తి శ్రీ సూర్య జంక్షన్ నుంచి కుమ్మరి వీధి వరకు ఉన్న డ్రైన్‌లోని మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో కార్పొరేటర్ వీరారావు స్పందించారు. ఎక్సకవేటర్‌ను రప్పించి పూడిక తీయించారు. జోన్-5 ఏఈ అర్చనను కార్పొరేటర్ పిలిపించి డ్రైన్ మరమ్మతులు చేయించిన తర్వాతే ఫుట్‌పాత్ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

పేదల కన్నీళ్లు తుడవడమే వైసీపీ ధ్యేయం

▸▸ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కన్నీళ్లు తుడవడమే వైసీపీ ధ్యేయమని రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం సంగివలస సభలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసిన ఘనత వైసీపీకి దక్కుతుందన్నారు. మరో మంత్రి సీదిరి అప్పలరాజు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. కాగా సభలో సీనియర్ నేతలకు ప్రసంగించే అవకాశం దక్కలేదు. మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు మాట్లాడకపోవడం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అసహనం తెప్పించింది.

'స్వచ్ఛత పక్వాడా' ర్యాలీ

మర్రిపాలెం, జనవరి 27: స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం మర్రిపాలెం వుడా కాలనీలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారి విశ్వాంజలి ఎం. గైక్వాడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మర్రిపాలెం వుడాకాలనీ, మర్రిపాలెం రైతుబజార్ తదితర ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది.పరిసరాల పరిశుభ్రతపై ఈనెల 16 నుంచి 31వరకు జనాలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

లక్కవరపుకోట, జనవరి 27: అనుమానాస్పద స్థితిలో విశాఖకు చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం చందులూరు గ్రామ శివారులో జరిగింది. స్థానిక ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలివి.. విశాఖలోని అరిలోవకు చెందిన గొలగాని సతీష్ (22) శుక్రవారం రాత్రి చందులూరులో ఓ మతపరమైన కార్యక్రమం కోసం కొంతమందిని ఆటోలో తీసుకువెళ్లాడు. వారంతా ప్రచారం చేస్తుండగా తనకు నీరసంగా ఉందని, కార్యక్రమం ముగిశాక ఫోన్ చేయాలని వెనక్కి వచ్చేశాడు. అతడి ఆచూకీ తెలియక వారంతా కార్యక్రమం ముగించుకుని మరో వాహనంలో వెళ్లిపోయారు. సతీష్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం ఉదయం గాలించగా గ్రామ శివారున చిన్న చెరువు వద్ద అచేతనంగా కనిపించాడు. తల్లిదండ్రులు నారాయణరావు, వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


సతీష్ మృతదేహం

'సిద్ధం' సభలో జగన్ చెప్పినవన్నీ అబద్ధాలే..

▸▸ సభ కోసం వ్యవస్థలతో ఊడిగం

▸▸ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

సీతంపేట, జనవరి 27: తగరపువలస వద్ద సిద్ధం పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు వల్లించడం అన్యాయమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు విమర్శించారు. ఈ సభ కోసం వైసీపీ నేతలు మూడు రోజులుగా వ్యవస్థలను వాడుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తొలుత షర్మిల, తర్వాత విజయమ్మ, రాజశేఖరరెడ్డిలను కూడా పక్కన పెట్టేశారన్నారు. నాలుగేళ్లుగా పోలవరం ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి చేయలేదని, విశాఖలో రాజధాని పేరు చెప్పి ఏం ఉద్ధరించారని ఆయన ప్రశ్నించారు. జగన్ పరిపాలన చూసి పారిశ్రామికవేత్తలు పారిపోయారన్నారు. ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనీసం పదిమందికి ఉద్యోగాలు కల్పించారా అని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఎందుకు మాట్లాడం లేదన్నారు. సిద్ధం సభలో తనకుతానే అర్జునుడని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అర్జునుడో.. రాక్షసుడో ప్రజలు త్వరలో తీర్పు ఇవ్వనున్నారన్నారు. మేనిఫెస్టోలో ఉన్న ప్రత్యేక హోదాపై ఎక్కడైనా మాట్లాడుతున్నారా... అని పంచకర్ల ప్రశ్నించారు. జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. సీఎంప్రభుత్వం బహిరంగ సభలు పేరిట ప్రజా ధనాన్ని వృధా చే స్తోందన్నారు.



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

సీఎం సభకు బస్సులు.. ప్రజలకు అవస్థలు

- అరకొరగా బస్సులు నడిపిన ఆర్‌టీసీ
- రాకపోకలకు గంటల తరబడి ప్రయాణికుల ఎదురుచూపు
- కిక్కిరిసి ప్రయాణాలు


నమ్మివానిపేట కాలనీ వద్ద ప్రయాణికుల పాట్లు


సింహాచలం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల నిరీక్షణ

సింహాచలం/తగరపువలస, జనవరి 27 : ముఖ్యమంత్రి జగన్ సిద్ధం పేరుతో సంగివలసలో నిర్వహించిన బహిరంగ సభకు జన సమీకరణ కోసం ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు వేయడంతో ప్రయాణికులు బస్సుల్లేక ఇబ్బందులు పడ్డారు. శనివారం కావడంతో వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సీఎం సభకు సింహాచలం డిపో నుంచి 42 బస్సులను తరలించడంతో భక్తులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి, గమ్యస్థానాలకు చేరుకున్నారు. బస్సులను సీఎం సభకు తరలించడంతో డిపోకు రూ. 3.2 లక్షల వరకు ఆదాయం నష్టం వచ్చింది. భీమిలి పరిసరాల్లోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో ఆ బస్సులన్నీ ప్రజల్ని సభకు తరలించడానికి ఉపయోగించారు. ఈ రూటులో 222 నంబరు ఆర్టీసీ బస్సలను తగ్గించడం వల్ల ఉదయం వరకు కొద్దిగా ఇబ్బంది పడగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. మధురవాడ, కొమ్మాది, బోయిపాలెం క్రాస్ రోడ్డు ప్రాంతాల నుంచి చాలా మంది విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళుతుంటారు. 111 నంబరు బస్సులు కూడా తగ్గించారు. దీంతో చాలా మంది ఆటోలపై రాకపోకలు సాగించారు. విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చే బస్సులను కూడా సాయంత్రం 4 గంటల తర్వాత నిలుపుదల చేసి వెనక్కి పంపించి వేయడంతో సంగివలస - తగరపువలస రూటులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి సమావేశం పూర్తయ్యే సమయంలో ట్రాఫిక్ అంతరాయం వల్ల కొన్ని కార్లను తగరపువలస నుంచి భీమిలి మీదుగా మళ్లించారు. అలాగే జాతీయ రహదారి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి సభకు వచ్చిన బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో వేంకటేశ్వర జంక్షన్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న రాజాపులోవ వరకూ ట్రాఫిక్ స్తంభించడంతో మరీ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తగరపువలసలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు శ్రీకాకుళం నుంచి వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో బస్సులు లేక గంటల తరబడి జాతీయ రహదారిపై నిరీక్షించారు. ఈ సందర్భంగా యారబాటి అమ్మాజి, రాజేశ్వరి మాట్లాడుతూ సీఎం సభకు బస్సులు వేసినా ప్రయాణికుల ఇబ్బందులను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అలాగే టి. నగరపాలెం గ్రామానికి చెందిన పొట్నూరు లక్ష్మి మాట్లాడుతూ బస్సులు లేవు సరికదా కనీసం ఆటోలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


నగేష్ కుటుంబీకులతో మాట్లాడుతున్న నాయకులు

ఎలుగుబంటి దాడిలో మృతి చెందిన నగేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఆరిలోవ, జనవరి 27 : జూపార్కులో గత ఏడాది నవంబరులో ఎలుగుబంటి దాడిలో మృతి చెందిన కార్మికుడు నగేష్ కుటుంబానికి తోటి సిబ్బంది శనివారం ఒక రోజు వేతనం రూ. 43 వేలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ నగేష్ కుటుంబానికి ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు. జూలో మళ్లీ ఇటువంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆరిలోవ అధ్యక్షుడు పి. శంకరరావు, కార్యదర్శి నరేంద్రకుమార్, యూనియన్ నాయకులు రాజు, నరేష్, రామారావు, నరసింగరావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ప్రణవ్‌గోపాల్

ఎంవీపీ కాలనీ, జనవరి 27 : ముఖ్యమంత్రి జగన్ పరిపాలనా తీరును, ఆయన విధానాలను తరచూ విమర్శిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్‌ను ఎంవీపీ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. జగన్ భీమిలి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు చెబుతుండగా, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ ఏది అన్ని ప్రశ్నించినందుకు తమ గొంతు నొక్కుతున్నారని ప్రణవ్ తెలిపారు.

గిరిజన నేత రామ్‌గోపాల్‌కు సీపీఐ నాయకుల పరామర్శ

ఎంవీపీ కాలనీ, జనవరి 27 : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో బస్సు బోల్తా పడిన సంఘటనలో గాయపడిన గిరిజన నాయకుడు గిడుతూరి రామ్‌గోపాల్‌ను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి శనివారం పరామర్శించారు. రామ్‌గోపాల్ ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాత్రపల్లి చంద్రశేఖర్, మరుపిళ్ల పైడిరాజు, అచ్యుతరావు, మార్కెండేయులు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల ఉన్నారు.

వసతి గృహానికి ఫ్రీజర్ వితరణ

ఆరిలోవ, జనవరి 27 : దీనదయాళపురంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహానికి కెనరా బ్యాంకు మేనేజర్ ఆదిరెడ్డి సతీష్ ఫ్రీజర్‌ను శనివారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర సౌకర్యార్థం సీఎస్ఆర్ నిధులు రూ. 26 వేలతో ఫ్రీజర్ కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం ఇన్‌చార్జి పీవీ రమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితా సరిచూసుకోవాలి'

పద్మనాభం (రూరల్), జనవరి 27 : ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వెళ్లి జాబితాలను సరిచూసుకోవాలని టీడీపీ మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొదల పావని చెప్పారు. శనివారం ఆమె కొవ్వాడ, పెంట, గంధవరం గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను కలిసి ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూతుల్లో ప్రదర్శించిన ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నది లేనిది సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొదల గౌరీశంకర్, తాతాజీ, వెంకటరమణ, అప్పారావు, బాలాజీ పాల్గొన్నారు.

నేడు చేయూత మహిళా మార్టు ప్రారంభం

పద్మనాభం, జనవరి 27 : మండల పరిషత్ కార్యాలయం సముదాయంలో నిర్మించిన చేయూత మహిళా మార్టును ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించనున్నారు. మండలంలోని 14990 మంది డ్వాక్రా సంఘాల సభ్యుల వాటా ధనం రూ. 60 లక్షలతో దీన్ని నిర్మించారు. ఇందుకు ఒక్కో సభ్యురాలి నుంచి రూ.450 వసూలు చేశారు. భవనం నిర్మాణానికి రూ. 30 లక్షలు, సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు రూ.15 లక్షలు, ఇతర సామగ్రికి 15లక్షలు వెచ్చించారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21,వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారేట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220


రైతు బజారులో క్యూ కట్టిన వినియోగదారులు

రైతుబజారులో కిలో శెనగ పప్పు రూ.60

ఎంవీపీ కాలనీ, జనవరి 27 : ఎంవీపీ రైతు బజారులో శనివారం నుంచి కేంద్ర ప్రభుత్వం సహకారంతో భారత్ దాల్ పేరిట రూ. 60 లకే కిలో శెనగపప్పు విక్రయాలను ప్రారంభించారు. సూపర్‌బజార్ గృహమిత్ర కౌంటర్ ద్వారా ఈ విక్రయాలు జరుగుతున్నాయి. ఆధార్ కార్డు చూపించి మూడు కిలోల వరకూ కొనుగోలు చేసుకోవచ్చని ఎస్టేట్ అధికారి ప్రసాద్ తెలిపారు.

అప్పన్న సేవలకు వెండి పళ్లెం బహూకరణ

సింహాచలం, జనవరి 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి సేవలకు వినియోగించాలని కోరుతూ నగరానికి చెందిన వ్యాపారి ఎం. శారదా 595 గ్రాముల బరువు గల వెండి పళ్లెం బహూకరించారు. కానుకను శనివారం ఉదయం దేవస్థానం డిప్యూటీ ఈఓ సుజాత, ఆలయ ఏఈఓ భ్రమరాంబకు దాత అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మధురవాడలో పందుల బెడద


మిథిలాపురి వుడా కాలనీలో సంచరిస్తున్న పందులు

మధురవాడ, జనవరి 27 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పందులు విచ్చ లవిడిగా సంచరిస్తున్నాయి. అధికారులు పందుల పెంపకందారులకు పలుమార్లు హెచ్చరిస్తున్నా.. వాటిని జనావాసాలకు దూరంగా తీసుకువెళ్లకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, పోర్టు కాలనీ, వాంబే కాలనీ ప్రాంతాల్లో గుంపు గుంపులుగా పందులు సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందుల వల్ల ఎప్పుడు ఏ వ్యాధి బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ


విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందిస్తున్న చిన్నారావు

పద్మనాభం, జనవరి 27 : మండలంలోని రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాలలో చదువుతున్న 303 మంది విద్యార్థులకు ఆకాంక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూరకాశి తేజ తన తాత అప్పారావు జ్ఞాపకార్థం ఏటా విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి ఇస్తుంటారు. ఈమేరకు శేరిఖండం సర్పంచ్ పి. చిన్నారావు చేతుల మీదుగా ప్లాంకు, పెన్ను, స్కేలు, వాటర్ బాటిల్‌తో పాటు స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సన్యాసిరావు, జగదీష్‌బాబు, ఉపాధ్యాయులు చిరంజీవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డీడ్ జారీకి సన్నాహాలు

పద్మనాభం, జనవరి 27 : జగనన్న లేఅవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఆయా స్థలాలను రిజిస్ట్రేషన్లు చేసి డీడ్ (హక్కుపత్రం) ఇవ్వడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈప్రక్రియ కోసం ఇప్పటికే ప్రభుత్వం గ్రామ సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలుగా గుర్తించింది. ఈమేరకు కార్యదర్శిని జాయింట్ సబ్ రిజిస్ట్రారుగా, వీఆర్వోను కార్యనిర్వాహకుడిగా, లబ్ధిదారుడ్ని హక్కుదారుగా చేస్తూ రిజిస్ట్రేషన్లు చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదే శాలు జారీ చేశారు. ఈమేరకు సచివాలయాల్లో జగనన్న కాలనీల్లో సెంటున్నర స్థలం పొందిన వారి స్థలాలను సత్వరమే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతం ఈనెల 29 నుంచి సచివాలయాల్లో లబ్ధిదారుల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ను అందజేస్తారు.

జీవిత ఖైదీలకు లభించని క్షమాభిక్ష

ఆరిలోవ, జనవరి 27 : నగరంలోని కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ లకు ఈఏడాది క్షమాభిక్ష రాకపోవడంతో ఖైదీలతో పాటు వారి కుటుంబీకులు నిరాశకు గురయ్యారు. గణతంత్ర దినోత్సవం రోజున జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో సత్ప్రవర్తన గల వారిని విడుదల చేస్తుంటారు. ఈమేరకు ఈ ఏడాది 21 మంది ఖైదీల విడుదలకు జైలు అధికారులు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి రాకపోవడంతో అధికారులు ఖైదీలను విడుదల చేయలేదు. ఈవిషయం తెలియని ఖైదీల బంధువులు ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి జైలు వద్దకు వచ్చి పడిగాపులు కాసారు. అధికారులు ఖైదీలను విడుదల చేయకపోవడంతో వారంతా నిరా శతో వెనుదిరిగారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


ఎకో వైజాగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెదవాల్తేరు, జనవరి 27 : పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఇప్పటి నుంచే అవగాహన అవసరమని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. శనివారం చినవాల్తేరులోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఎకో వైజాగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మామిడి, సపోటా, సీతాఫలం, నేరుడు వంటి పండ్లు తిన్న తరువాత ఆ విత్తనాలను ఆరబెట్టి వర్షాలు కురిసే సమయంలో కొండల మీద, మైదానాల్లో, రహదారుల పక్కన జల్లి, మొక్కలు వచ్చేలా చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వనిత, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు బి. భరద్వాజ్ కుమార్, ఎ. వెంకటరమణ, సీహెచ్ రాజేశ్వరి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీఎంకి వినతి

తగరపువలస, జనవరి 27 : చిట్టివలస జూట్‌మిల్లు ప్రాంతంలో భీమిలి నియోజకవర్గానికి అవసరమైన పరిశ్రమను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. శనివారం ఆయన సంగివలస సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా సీఎంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిల్లు మూతపడిన తర్వాత యాజమాన్యం లాజిస్టిక్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని, కానీ ఎటువంటి ప్రయత్నం చేయకపోగా ఉన్న ఆస్తులను అమ్మా లని చూస్తోందన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు కూడా చెల్లించడం లేదని చెప్పారు. జూట్‌మిల్లు వల్ల పరిసర ప్రాంతాలకు చెందిన 40 గ్రామాల్లో 8 వేల మంది కార్మికులు ఉపాధి పొందేవారని, ప్రస్తుతం వారంతా ఉపాధి లేకుండా వలస వెళ్లిపోయారన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

నమ్మివానిపేట కాలనీ వద్ద చెక్‌పోస్టు

భీమునిపట్నం, జనవరి 27 : సంగివలసలో సీఎం జగన్ సభ జరిగిన నేపథ్యంలో శనివారం భీమిలి బ్యాంక్ కాలనీ, దెక్కతిపాలెం, నమ్మివానిపేట కాలనీ జంక్షన్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాలనీకి సమీపంలో సీఎం హెలీప్యాడ్ ఏర్పాటు చేయడంతో ఆ రహదారి మీదుగా వాహన రాకపోకలను నిలిపివేశారు.

98వ వార్డులో గెడ్డ ఆక్రమణ

సింహాచలం, జనవరి 27 : జీవీఎంసీ 98వ వార్డులో కొందరు తమకు చెందిన భూమితో పాటు సమీపంలోని గెడ్డను కూడా ఆక్రమిస్తున్నారు. వార్డు పరిధిలోని సర్వే నంబర్లు 175, 176లో కొన్ని దశాబ్దాలుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ, గాంధీనగర్ నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లే గెడ్డ ఈ ప్రాంతం మీదుగా పయనించి మేహాద్రి గెడ్డకు చేరుకునేది. కాలక్రమంలో అనేక భూముల్లో భవంతులు వెలియడంతో సంబంధిత ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు అంతగా శ్రద్ధ చూపకపోవడంతో వార్డు పరిధిలోని పలు గెడ్డలు కుచించుకుపోగా, మరికొన్ని ఆక్రమణలతో కనుమరుగయ్యాయి. తాజాగా ప్రియాగార్డెన్స్‌లోని మురుగనీటి గెడ్డను కూడా ఆక్రమించి సన్నటి సిమ్మెంటు గొట్టం ఏర్పాటు చేశారు. స్థలానికి తాత్కాలిక రోడ్డు వేయడానికి కూడా యత్నిస్తున్నారు. పెందుర్తి, చినగదిలి రెవెన్యూ అధికారులు 1996లో ఇచ్చిన పట్టాలు ప్రకారం గెడ్డలు కూడా సింహాచల దేవస్థానానికి దఖలు పడ్డాయి. కానీ దేవస్థానం అధికారులు ఆక్రమణపై దృష్టిసారించకపోగా, తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు జరిపిన సర్వే ప్రకారం ఆ స్థలం తమది కాదంటూ స్థానిక వీఆర్ఓ చెబుతున్నారు. గెడ్డ ఆక్రమణపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.


చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు గృహ నిర్బంధం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27 : సీఎం జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. శనివారం ఉదయాన్నే ఇద్దరు మహిళా పోలీసులు అక్కిరెడ్డిపాలెంలోని అనంతలక్ష్మి ఇంటికి చేరుకుని హౌస్ అరెస్టు చేస్తున్నట్టు ఆమెకు తెలిపారు. జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా తాము గృహ నిర్బంధం చేస్తున్నట్టు పోలీసులు స్పష్టం చేయడంతో అనంతలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని ఆమె పోలీసులకు తెలిపినా వారు అంగీకరించలేదు. సీఎం విశాఖ వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేయడం ఆయన నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు.

ఘనంగా అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సిరిపురం, జనవరి 27 : దేశ ఆర్థికాభివృద్ధిలో విశాఖపట్నం కస్టమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని వక్తలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కస్టమ్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, విశాఖపట్నం పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ కస్టమ్స్ ద్వారా జాతీయ ఖజానాకు రూ. 15990.62 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ (2023) వరకు రూ. 11757.82 కోట్లు కాగా లక్ష్యం రూ.16,942 కోట్లు అన్నారు. కస్టమ్స్ విభాగంలో ఉత్తమ ఉద్యోగులను సత్కరించడంతో పాటు అవార్డులు అందజేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్, తదితరులు పాల్గొన్నారు.


మ్యాచ్‌కు సిద్ధం చేస్తున్న స్టేడియం

భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కు స్టేడియం సిద్ధం

మధురవాడ, జనవరి 27 : పీఎంపాలెం ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో మరో ఐదు రోజుల్లో జరిగే భారత్, ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్‌కు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఈ మ్యాచ్‌కు ఇప్పటికే టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. పిచ్‌తో పాటు ఔట్ ఫీల్డు సిద్ధం చేస్తున్నారు. గ్యాలరీల్లో పాడైన కుర్చీలు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే స్టేడియం పరిసరాల్లో ఏడు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచ్ జరిగే రోజుల్లో ప్రతిరోజూ రెండు వేల మంది విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం కల్పించడానికి ఏసీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లడ్ లైట్లతో పాటు నిరంతరం విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, జనవరి 27 : ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తులు పంపించాలని కోరారు. వచ్చే నెల 5 నుంచి 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులను డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు లను బీసీ స్టడీ సర్కిల్, సెక్టరు 6, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం చిరునామాకు పంపించాలని, వివరాలకు 0891 2564346, 94925 69177 ఫోన్ నంబర్లను సంప్రతించాలని సూచించారు.

గీతం దంత వైద్య కళాశాల స్నాతకోత్సవం


విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న మధ్యప్రదేశ్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ అశోక్ ఖాండేవాల్, గీతం విద్యా సంస్థల చైర్మన్ శ్రీభరత్

సాగర్‌నగర్, జనవరి 27 : గీతం దంత వైద్య కళాశాల 17వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ గాంధీ మార్గంలో సత్యం, ధర్మం, సమాజం పట్ల బాధ్యత, వృత్తి విలువలను పాటించడం ద్వారా వైద్యులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని చెప్పారు. గ్రామాల్లో దంత వైద్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి నుంచి బీడీఎస్, ఎండీఎస్ కోర్సులు పూర్తి చేసిన 131 మందికి దంత వైద్య విద్యా మండలి జాతీయ సభ్యుడు, మధ్యప్రదేశ్ మెడికల్ వర్సిటీ వీసీ డాక్టర్ అశోక్ ఖాండేవాల్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో గీతం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధ పట్టం, దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సీతారామరాజు, ప్రొఫెసర్ ఎం. గంగాధర రావు, జిమ్‌సర్ ప్రొఫెసర్ డాక్టర్ బి. గీతాంజలి, కార్యదర్శి ఎం. భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలో నవోదయ విద్యార్థి ప్రతిభ


నగదు అందుకుంటున్న వంశీకృష్ణ

కొమ్మాది, జనవరి 27 : లోనావాలకు చెందిన సముద్ర మారిటైమ్ అధ్యాయన సంస్థ, సింగపూర్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ షిప్ మేనేజ్మెంట్ సంస్థ సంయుక్తంగా అఖిల భారత స్థాయిలో నిర్వహించిన ప్రతిభా అన్వేషణ పరీక్షలో స్థానిక నవోదయ విద్యాలయానికి చెందిన వంశీ కృష్ణ ప్రతిభ చూపాడు.ఈ పరీక్షలో వంశీకి 48వ ర్యాంకు రావడంతో నిర్వాహకులు రూ. 1000 నగదు బహుమతి అందించినట్టు ప్రిన్సిపాల్ కె. సంజయ్ తెలిపారు. వంశీతో పాటు ప్లస్ టూ చదువుతున్న మహేంద్ర, సందీప్ కూడా పరీక్షలో ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను శనివారం నవోదయ విద్యాల యంలో ఉపాధ్యాయులు అభినందించారు.

15లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి : ఏఓ

పద్మనాభం (రూరల్), జనవరి 27 : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి వచ్చే నెల 15వ తేదీలోగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ చలం చెప్పారు. శనివారం ఆయన అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులకు అవసరమైన సూచనలు , సలహాలు సకాలంలో అందించాలన్నారు. ఈక్రాప్ నమోదు శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత లేదన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, జనవరి 27 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడసోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

'సిద్ధం' సభకు తరలివెళ్లిన వైసీపీ శ్రేణులు

పద్మనాభం (రూరల్), జనవరి 27 : భీమిలి మండలంలోని సంగివలసలో జరిగిన సీఎం జగన్ సభకు వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బస్సులను ఎంపీపీ కె. రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు.అనంతవరం, గొల్లలపాలెం, పెంట, కొవ్వాడ, గంధవరం గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో సభకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెదఎర్రి నాయుడు, జడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, కోరాడ లక్ష్మణరావు, బుగత సత్యనారాయణ, బోని సన్యాశినాయుడు, అప్పలనాయుడు, పద్దు పాల్గొన్నారు.

బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

భీమునిపట్నం (రూరల్), జనవరి 27 : మోపాడలోని కేజీబీవీ విద్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన జె. సురేష్‌కుమార్ బాలికలకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన టెన్త్ విద్యార్థినులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే సామాజిక స్పృహ, నైతిక విలువలు, ఆరోగ్యం తదితర అంశాలపై తెలిపారు.

క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

భీమునిపట్నం, జనవరి 27 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని రాష్ట్ర గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా సూచించారు. శనివారం బీచ్ రోడ్ తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. తన జీవితానుభవాలను వివరిస్తూ, కష్టపడితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమన్నారు. అనంతరం ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చిన వారిని సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ కళింగ చీఫ్ ఇంజనీరు కెప్టెన్ జి. కృష్ణకుమార్, విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ సీఈవో నందిగామ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ చైతన్య, సీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.